# అమ్మని పంచుకొందాం

– కె.వి.నరేందర్

**ఎలక్షన్ డ్యూటీ ఎక్కడ పడుతుందో** నని కొంత ఆందోళన పడుతున్న టైం లో ఆర్డర్స్ అందుకొని ఆశ్చర్యపోయాను.

ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా 'చిల్వాకోదూర్' పడటం! కారణం....

అది నేను పుట్టినవూరు. బాల్యమంతా సీతాకోక చిలుకలా గడిచిన వూరు. తూనీగలా ఎగిరిన వూరు. కరణంగారి తోటలో జాంపండ్లు దొంగిలించినవూరు. బడికి వెళ్లకుండా రోజంతా చెరువులో ఈతకొట్టిన వూరు.

ఎప్పుడు ఏ తుంటరి పనిచేసినా అమ్మనించీ, నాన్ననించీ తన్నులు తిన కుండా రోజంతా చెరువులో ఈతకొట్టిన వూరు.

ఎప్పుడు ఏ తుంటరి పనిచేసినా అమ్మనించీ, నాన్ననించీ తన్నులు తినకుండా కాపాడేది నానమ్మ!

తెల్లచీరలో ఎర్రగా బొద్దుగా వుండే నానమ్మ.... ఇప్పుడెలా వుందో? ఏడేళ్లయింది ఆ వూరెళ్లక.

నానమ్మ గుర్తొస్తే...మనసు మూగగా రోదిస్తుంది. ముఖ్యంగా ఏడేళ్లకింద సంఘటన....

ఉమ్మడికుటుంబం మూకుమ్మడిగా విడిపోయిన రోజు గుండెలు బాదుకున్న నానమ్మ... పెదనాన్న, మానాన్న, చిన్నాన్న ముగ్గురూ ఆస్తులు పంచుకున్నాక.... అందరి దృష్టీ మిగిలిపోయిన నానమ్మ వైపు..

ఆస్తి పంపకాల సమయంలో మూడు కుటుంబాల్లోనూ ఏదో తెలీని ఉద్రిక్తత. మనసులు మూగపోయి గుండెల్నిండా స్మశాన స్తబ్దత. ఇంట్లో మాటలే కరువయ్యాయి. గదుల్లో అడ్డుగోడలు మొలిచాయి. మా నాన్న ఏదోలా బాధగా వుంటె అమ్మ మాత్రం నిష్టూరంగా 'మారేళ్లయినా చావుతప్పదు. వెయ్యేళ్లేయినా వేరు తప్పదు.

దేనికి బాధ పడటం' అంది. ఇంట్లో ఆడాళ్లకు మాత్రం ఏదో పీడ విరగడైనట్టే వుంది, ఒక్క నానమ్మకు తప్ప...

నానమ్మ మౌనం అందర్నీ బాధిస్తుంది. తను చచ్చిపోయాక ఆస్తి పంచుకోవాలని నానమ్మ కోరిక. అందుకే ఆస్తి పంచేరోజు అందరి మీదా దుమ్మెత్తిపోసింది. ఏడ్చింది. తాతను తల్చుకుంటూ శోకం పెట్టింది. అయినా పంపకాలు ఆగలేదు.

వాళ్లు పుట్టేముందు నెత్తురు పంచిచ్చి, తాను గిట్టేముందు ఆస్తులు పంచిచ్చి... పెంపకానికి, పంపకానికి మధ్యన నలికిన వృధార్త దేవతలా మిగిలిన నానమ్మని నాలుగో రోజున పెద్దమనుషులడిగారు.

'రుక్మమ్మా.... నీ కొడుకులు నిన్ను పంచుకుంటారట. ముగ్గురిళ్లల్లో ఎన్నినెలల చొప్పన వుంటావో చెప్పు' అన్నారు.

ఆమాట విన్న నానమ్మ ఉగ్రురాలైంది 'నా పేగు పంచుకున్నోళ్లు.. ఇవ్వాళ నన్ను పంచుకుంటార్రటా' అని వూగిపోయింది. ఈ సంఘటన నానమ్మని బాగా కలిచివేసినట్లయింది. రోజంతా తన గదికి గడియ పెట్టుకొని లోపలే ఒంటరిగా వుండిపోయింది.

అంతా భయపడ్డారు గాని.. మర్నాడు నానమ్మ తలుపుతీసి ముగ్గురు కొడుకుల్ని పిలిచి చెప్పింది.

"నేనిదే గదిలో వండుకు తింటాను. ఎవడి పంచనా చేరను" అంది కొడుకులకు మాట పెగల్లేదు.

"కళ్లు కన్పించవు గాని ముసల్దానికి రోషానికేం తక్కువ లేదు' మూతులు త్రిప్పారు కోడళ్లు. కాని ఆ తర్వాతే పిడుగులాంటి మాట చెప్పింది నానమ్మ.

"....కాని ఈ ఇంట్లో ఎవడూ వుండటానికి వీల్లేదు. నా కొడుకలు విడిపోయి నా కళ్ల ముందుంటె నేను చూళ్లేను. కాబట్టి మీరు బయటి ఇళ్లల్లో కాపురాలు పెట్టుకోవటం మంచిది"

అడ్డుగోడలు మొలిచాక గదులన్నీ ఇరుకై అవస్థపడుతున్న కోడళ్లకి ఈ మాట చల్లగానే అన్పించినా... కొడుకులు మాత్రం తల్లిని వేడుకున్నారు. తమతో వుండమన్నారు. పువ్వులాగా చూసుకుంటామన్నారు. అయినా నానమ్మ మంకుపట్టు విడవలేదు.

ఫలితంగా అదేవూర్లో వ్యవసాయం చేసుకునే పెదనాన్న, చిన్నాన్న వేరే ఇళ్లల్లో కాపురం పెడితే, ఉద్యోగరీత్యా రోజూ కరీంనగర్‌కు వచ్చిపోయే మా నాన్నతో పాటు శాశ్వతంగా మేం కరీంనగరం వచ్చేసాం.

ఈ మధ్యకాలంలో పెదనాన్న, చిన్నాన్న మధ్య గొడవలు పెరిగి బద్ధశత్రువులై వూర్లోవుండి కూడా నానమ్మ దగ్గరికి ఒక్కరోజు కూడా వెళ్లలేదని నాన్న చెప్తేవాడు. నానమ్మని తీసుకురావాలని నాన్న చేసిన ప్రయత్నాలన్నీ తిరస్కరించిందట.

"ఏమిట్రా....? ఏదో దీర్ఘాలోచనలో పడ్డావ్? " అమ్మమాటతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి కొచ్చాను.

"ఏం లేదమ్మా... ఉద్యోగంలో జాయినై నెలరోజులైందో లేదో... అప్పుడే ఎలక్షన్లు వచ్చి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా డ్యూటీ పడి ఆర్డర్స్ వచ్చాయి. విచిత్రమేంటో తెల్సా అమ్మా...నాకు చిల్వాకోదూర్‌లో డ్యూటీ పడింది". అన్నాను.

పేపర్ చదువుతున్న నాన్న త్రుళ్లిపడి 'ఏంటి మనూరికా' అనడిగాడు.

"అవున్నాన్నా"

"ఆ వూర్లో సర్పంచ్‌గా నిల్చుందెవరో తెల్సా? మీ పెదనాన్నా, చిన్నాన్న, ఇద్దరికీ పోటీ?

"అట్లాగా... ఏమైనా నానమ్మని చూసొస్తాను నాన్నా"అన్నాను

'సరే ... ఎవరింట్లోనూ తినకు. జాగ్రత్తగా వెళ్లిరా' అంది అమ్మ. ఎలక్షన్స్‌కి ఇంకా వారంరోజుల టైముంది.

* * * * *

ఓటింగ్ స్టార్టయింది.....

నన్ను పెద్దనాన్నా, చిన్నాన్నా పలకరించిపోయారు. నా మనసంతా నానమ్మనే పలవరిస్తున్నా ఓటర్ల రద్దీ పెరగడంతో ఆలోచించే తీరిక కూడా లేదు. అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు పోలింగ్ క్లర్క్‌లు బ్యాలెట్ చించియ్యటం, ఓటరు పేరు సరిచూసి సంతకాలు తీస్కోవటం, పోలింగ్ ఏజెంట్ల గుసగుసలు, ఓటర్ల తొక్కిసలాటతో అంతా బిజీగా వుంది. ఊపిరి పీల్చుకుందామన్నా తీరిక దొరకనంత పని!

సరిగ్గా మూడు గంటలవుతున్న సమయంలో ఓటర్ల రద్దీ బాగా తగ్గింది. రిలాక్స్‌గా కుర్చీలో వెనక్కివాలి కూర్చుంటూ పోలింగ్ బూత్‌కి కొంత దూరంలో ఆగిన తెల్లని కారులోంచి దిగిన వ్యక్తిని చూసి స్తన్నయ్యాను.

కారులోంచి వంగిపోయి... పాడిపోయి దిగుతున్న .... నానమ్మ! ఎక్కడో గుండె గదుల్లో జ్ఞాపకాల శిథిలాల కింద... బాల్యం గిలగిలా తన్నుకొని, అనుబంధాన్ని ఆత్మీయతనీ కన్నీళ్లతో చిలికినట్టు... కళ్లు తడిగా మారాయి.

నానమ్మ వెనకే చిన్నాన్న దిగి ఏదో చెప్తున్నాడు. తనే నానమ్మని తీసుకువచ్చి నట్టున్నాడు.

నానమ్మ బూత్ వైపు వస్తుంటే, నిన్న తెంపిన తెల్లగులాబి నడిచొస్తున్నట్టే వుంది. నానమ్మ కెదురగా పెదనాన్న వెళ్లాడు. భుజం మీద చేసివేసి ఆప్యాయంగా నడిపించుకుంటూ... తన చేతిలోని నమూనా బ్యాలెట్ పేపర్‌మీద తన గుర్తును చూపిస్తున్నాడు.

నానమ్మ తలూపుతోంది..

గదిలోకి రాగనే... గబగబా ఎదురగావెళ్లి "నానమ్మా... బావున్నావా... నేను రాధాక్రిష్ణని" అన్నాను పరిసరాల్ని మరచి ఆత్రుతగా...

నానమ్మ కళ్లు చిట్లించి చూసి ఆప్యాయంగా నా బుగ్గల్ని తడిమింది. జీవం లేని నానమ్మ కళ్లలో సన్నటి నీటిపొర..

"నాన్న బాగున్నాడా....?" నాలుక సహకరించక గొంతు పెగలక బరువుగా అడిగింది.

"బాగున్నాడు..." నేను అనేంతలో పోలింగ్ క్లర్క్ బ్యాలెట్ చించి ఇంక్ ప్యాడ్ మీద స్వస్తిక్ లాంటి ముద్రని కొట్టి రెండూ నానమ్మ చేతికిచ్చాడు.

ఓ మూలగా కట్టిన కర్టెన్ చాటుకి వెళ్లి బ్యాలెట్‌పై ఏదో ఒక గుర్తుపై ముద్రవేయాలి. నానమ్మకి ఆసరాగా నే వెళ్లబోతుంటె వద్దంది.

తటాలున వచ్చిన ఆలోచన...!

నానమ్మ ఓటు ఏ కొడుక్కి వేస్తుంది...?

నానమ్మ బ్యాలెట్‌తో బరువుగా నడుచుకుంటూ పరదా ప్రక్కకెళ్లింది.

నాలో ఉత్కంఠ.... ఏ గుర్తుకేస్తుంది??

పెదనాన్న కుండగుర్తుకా...?

చిన్నాన్న కాగడా గుర్తుకా...??

ఎలాగైనా చూడాలి! నాలో ఆత్రుత పెరుగుతుంటె నానమ్మ ముద్రవేసి బ్యాలెట్ బాక్స్ దగ్గరికి వచ్చింది. బాక్స్‌లో ఓటు సరిగా వేయరావట్లేదు. ఆ అవకాశాన్ని తీసుకుని బ్యాలెట్ పేపర్ తీసికొని 'ఓటు సరిగా మలచలేదు నానమ్మ' అని విప్పిచూసి షాక్ తిన్నాను.

తిరిగి ఆ ఓటుని మలిచి బాక్స్‌లో వేసాను.

నానమ్మకి ఆసరాగా బయటివరకూ తీసికెళ్లాను. కార్లో కూచోబెట్టాలను కుంటే బయటకారు లేదు.

కొంతదూరం నడిచాక 'నానమ్మా.... ఇద్దరి కొడుకుల మీద ప్రేమతో రెండు గుర్తులకీ ముద్రవేసావు... కానీ అది చెల్లదు అన్నాను.

నానమ్మ నావైపు చూసింది. ఆ కళ్లలోతుల్లో ఎప్పటికీ అందని భావాలు. ఆ భావాల్ని కప్పేతున్న భాష్పాలు!

"నా అంతరాత్మ సాక్షిగా చెల్లుతుందిరా.. జీవితంలో ఇప్పటికి పధ్నాలుగు సార్లు ఓటేసాను. కాని ఇప్పటిదే సరైంది.

ఏడేళ్ళు తొంగిచూడని వాళ్లు... స్వార్థంతో ఓటుకోసం పలకరించారు. ఆ రెండు గుర్తులూ నాకవసరమే. రేపు చస్తే పెద్దవాడి చిల్లికుండ కావాలి. చిన్నోడు తలకొరివి పెట్టడానికి కాగడా కావాలి. అందుకే నేనూ స్వార్థంగా ఓటేసాను రెండు గుర్తులమీదా!

ఆనాడు... నన్ను పంచుకోవాలనుకున్నారు.

ఈనాడు... నా ఓటుని పంచుకోవాలనుకున్నారు" అని నవ్వింది. నానమ్మ మాటలకి నివ్వెరపోయి నిల్చున్నాను.

'సరేకానీ... మీ నాన్ననోసారి వచ్చివెళ్లమను" అని కదిలింది. నానమ్మ వెళుతూంది....

నిన్న తెంపిన తెల్లగులాబి .... నడిచివెళ్తున్నట్టే వెళ్తోంది.

భూమిలో కూరుకుపోయినట్టు... నేను నిల్చుండిపోయాను అలాగే!!

# ఈ వారం అబద్ధాలు

"అమితాబ్ కంటే నేనే గొప్పనటుణ్ని"

– శత్రుఘ్నసిన్హా

సేకరణ: డి.నరెడ్డి, చైతన్య విద్యావిహార్, వేస్తవారపేట–523 334

('ఆంధ్రభూమి' 14–9–95)

"కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలంతా కోరుతున్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అన్ని స్థానాలనూ మేమే గెల్చుకుంటాం"

కాంగ్రెస్ ఎం.పి.
వై.ఎస్.రాజశేఖరరెడ్డి

సేకరణ: టి. ఆంజనేయులు, వడ్లమూడి

('ఈనాడు' 10–9–95)

ఇప్పటికీ అన్న ఎన్.టి.రామారావుగారే నాకు దేవుడు"

–సినీనటుడు మోహన్‌బాబు

సేకరణ: కె.విద్యుల్లత, రాజనగరం, రాజమండ్రి

('ఆంధ్రజ్యోతి' 15–9–95)

"పి.వి. కేబినెట్‌లో వై.ఎస్., మాగుంట"

– ఆంధ్రప్రభ, తదితర పత్రికలు
13–9–95

సేకరణ: ఎల్.కనకదుర్గ, వన్‌టౌన్, విజయవాడ

"ప్రధాని పి.వి. కొత్తగా జరిపిన మంత్రి వర్గవిస్తరణ పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠలను ఇనుమడింపచేస్తుంది"

– కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి
వి.ఎన్.గాడ్గిల్

సేకరణ: ఎస్.ఎం. షరీఫ్, కంటోన్మెంట్, సికింద్రాబాద్

('ఆంధ్రజ్యోతి' 14–9–95 హైదరాబాద్ ఎడిషన్)

"పాకిస్తాన్ అణ్వాయుధాలను ఉత్పత్తి చేయరాదన్న ఒప్పందమేదీ పాక్, అమెరికాల మధ్య లేదు"

– అమెరికా విదేశాంగశాఖ సహాయకార్యదర్శి
రాబిన్ రాఫెల్

సేకరణ: బి. అంజనీకుమారి, గొల్లపూడి

('ఆంధ్రజ్యోతి' 16–9–95)